క్లుప్తంగా

మహాబిల్వం మొక్కను నాటిన నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా స్థానిక సుప్రసిద్ధ మర్రిచెట్టు శివాలయంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా నాయకుడు కొలిపాక సతీష్-సునీత దంపతులు తీసుకువచ్చిన మహాబిల్వం మొక్కను ఘన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు శుక్రవారం నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరమశివుడికి అత్యంత ఇష్టమైన మహాబిల్వం చెట్టును కార్తీక పౌర్ణమి రోజున నాటినట్లు తెలిపారు. ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలుంటే తెలపండి

చిల్పూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎస్సై సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నిర్వాహకులు, రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పోలేపల్లి రంజిత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లింగయ్య, అలుగు అశోక్, సాంబరాజు, పోలేపల్లి రాజిరెడ్డి, పెద్ది రాములు, నిర్వాహకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చిల్పూరు: నష్కల్ సమీపంలోని జాతీయ రహదారిలో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. మడికొండకు చెందిన వల్లెపు రమేశ్, పొట్లబత్తిని రమేశ్, కాజీపేటకు చెందిన ఆలకుంట్ల రాజులు మూడు ప్యాసింజర్ ఆటోల్లో ఒక్కొక్కరు 5 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో చిన్నపెండ్యాల వైపుకు వస్తున్నారు. పక్కా సమాచారం మేరకు నష్కల్ బస్‌స్టేజీ సమీపంలో ఆటోలను ఆపి తనిఖీ చేయగా బియ్యం బ్యాగులు కనిపించాయి. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్వాముల మాలధారణ

జనగామ రూరల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బాణాపురం అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వాములకు మాలధారణ కార్యక్రమం చేశారు. ప్రధాన అర్చకుడు రాజేశ్వరాచారి ఆధ్వర్యంలో 150 మంది స్వాములు మాలలు వేసుకున్నారు. మకర సంక్రాంతి వరకు భక్తిశ్రద్ధలతో అయ్యప్పను నిష్ఠతో పూజించాలని వారికి అర్చకుడు నియమాలు వివరించారు.

శ్రీధర్‌కు గౌరవ డాక్టరేట్



దేవరుప్పుల: వివిధ రంగాల్లో సామాజిక సేవాదృక్పథంతో సేవలందిస్తున్న పలువురికి స్ఫూర్తి సర్వీసు సొసైటీ ఇండియా, ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ రికార్డు, ఏషియన్ వేదికఆధ్వర్యంలో తలపెట్టిన ఎక్సలెన్స్ గౌరవ డాక్టరేట్ రెవెన్యూ కార్యాలయం జూనియర్ అసిస్టెంటు అంబాల శ్రీధర్‌కు లభించింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ కింగ్ కోఠీ ఏరియాలోని తెలంగాణ సరస్వతీ పరిషత్ ఆడిటోరియంలో సామాజిక స్పృహ కలిగించే డాక్యుమెంటరీ సినిమాలు చిత్రీకరించినందుకు గాను శ్రీధర్‌కు ఎస్జీఓ ఫౌండర్, చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేశ్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు.

ఎన్నిక

చిల్పూరు: నేటి నుంచి 18వ తేదీ వరకు మండలంలోని చిన్నపెండ్యాలలో నిర్వహించే భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం శుక్రవారం రాత్రి నూతన నిర్మాణ కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షుడిగా గజ్జెల దామోధర్, ఉపాధ్యక్షులుగా పేరాల నాగభూషణం, రఘునాథ్, ప్రధానకార్యదర్శిగా పేరాల రాజన్‌బాబు, సహాయ కార్యదర్శిగా మంద రాజు, కోశాధికారిగా అశోక్, సభ్యులుగా కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, జ్ఞానేశ్వర్, నారాయణ, రమేశ్, సంపత్‌కుమార్ ఎన్నికయ్యారు.

నివాళి

రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాదె భాస్కర్ రెడ్డి గురువారం గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే.. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రఘునాథపల్లికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి కాంగ్రెస్ కండువా వేసి పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ జెడ్పీటీసీలు మారుజోడు రాంబాబు, లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, కోళ్ల రవిగౌడ్, లోనె శ్రవణ్, మినుముల వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పోకల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దేవరుప్పుల శివాలయంలో..



బచ్చన్నపేట: కొడవటూర్‌లో..



స్టేషన్‌ఘన్‌పూర్: క్యూలో భక్తులు



జనగామ రూరల్: ఉప్పలమ్మ ఆలయంలో..



జఫర్‌గఢ్: రామాలయంలో..



భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

కార్తీక పౌర్ణమి పర్వదినం, కార్తీక శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భక్తులు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ప్రమిదల్లో దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించా రు. దీంతో గ్రామాల్లో కార్తీక శోభ, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



జనగామ: సత్యనారాయణస్వామి వ్రతంలో భక్తులు



స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో..



చిల్పూరు: బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో సహస్ర దీపోత్సవంలో అర్చకులు



బచ్చన్నపేట: బండనాగారం రామలింగేశ్వరాలయంలో..




తరిగొప్పల: చెన్నకేశవాలయంలో..



రఘునాథపల్లి: మహాదేవస్వామి ఆలయంలో..



చిల్పూరు: సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు



చీటకోడూర్ రామలింగేశ్వరాలయంలో..



కొడకండ్ల: రామవరం శివాలయంలో..



లింగాలఘణపురం: జీడికల్‌లో పుష్కర స్నానాలు చేస్తున్న భక్తులు



లింగాలఘణపురం: వీరాచల రామచంద్రుడిని దర్శించుకుంటున్న భక్తులు



బచ్చన్నపేట: సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు



స్టేషన్‌ఘన్‌పూర్: కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



బచ్చన్నపేట: అచల యోగాశ్రమంలో మాస పత్రికను ఆవిష్కరిస్తున్న శ్రీధరస్వామి

రాజయ్య..తీరు మార్చుకో!

- కాంగ్రెస్ నాయకులు జగదీష్‌చందర్‌రెడ్డి, రాంబాబు

రఘునాథపల్లి: మచ్చ లేని ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మతిభ్రమించి మాట్లాడటం సిగ్గు చేటని, నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించబోమని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబులు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేవాదుల సృష్టికర్త, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న కడియంపై అడ్డగోలు విమర్శలు చేయడం మూర్ఖత్వమన్నారు. రాజయ్య తీరు మార్చుకోవాలన్నారు. నాయకులు మేకల నరేందర్, లోనె శ్రవణ్‌కుమార్, ఎండి బాషుమియా, కావటి భాస్కర్, తోటకూరి రమేష్, బంద కుమార్, కరుణాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కడారి రవి, గడ్డమీది కిరణ్, లక్ష్మారెడ్డి, మల్లేష్, అరూరి శ్రీనివాస్, మహేందర్, యాదగిరి, వడ్లకొండ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కడియంపై తప్పుడు ఆరోపణలు చేస్తే తరిమికొడ్తాం..

స్టేషన్‌ఘన్‌పూర్: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య కబడ్దార్ అని, ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అసత్యపు ఆరోపణలు చేస్తే నిన్ను, నీ అనుచరులను గ్రామాల్లో తరిమికొడ్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బెలిదె వెంకన్న, ఘన్‌పూర్ మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డాక్టర్ రాజయ్య ఉద్దేశ్యపూర్వకంగా కాంగ్రెస్‌పార్టీపై అవాకులు, చవాకులు పేలుతున్నాడని, అసలు రాజయ్యకు రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీ, దివంగత మహానేత వైఎస్ఆర్ అని గుర్తు చేశారు. మచ్చ లేని నాయకుడు, నీతికి, నిజాయితీకి మారుపేరైన స్థానిక ఎమ్మెల్యే కడియంపై అటవీభూములు అన్యాక్రాంతం అని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. రాజయ్యకు కాంగ్రెస్‌పార్టీని, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించే నైతిక హక్కు ఎంతమాత్రం లేదన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, పార్టీ చిల్పూరు మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: మాట్లాడుతున్న జగదీష్‌చందర్‌రెడ్డి, రాంబాబు

కథ కంచికేనా?

- నేటికీ అందని 'మన ఊరు-మనబడి' బిల్లులు
- అసంపూర్తి డైనింగ్ హాల్ నిర్మాణం
- రూ. లక్షల డైనింగ్ సామగ్రి వృథా



అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్



గదిలో భద్రపరిచిన డైనింగ్ సామగ్రి

లింగాలఘణపురం: గత ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన మనఊరు-మనబడి కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనుల కథ కంచికేనా అనే అనుమానం నెలకొంది. ఒకవైపు చేసిన పనులకు బిల్లులు రాక పనులు ఎస్ఎంసీ చైర్మన్లు దిక్కుతోచని స్థితిలో పడగా లక్షలాది రూపాయలతో తెచ్చిన డైనింగ్ టేబుళ్లు, బెంచీలు ఏడాదిగా నిరుపయోగంగా ఉన్నాయి. 2022–2023లో గత ప్రభుత్వం మనఊరు-మనబడి కార్యక్రమంతో పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం గదుల నిర్మాణం, డైనింగ్ హాళ్లు, విద్యుత్, బోధన సౌకర్యాలు ఏర్పాటు చేసింది. మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల్లో ఒక్కొక్కదానికి సుమారుగా రూ.11లక్షల నుంచి రూ.13 లక్షలు మంజూరు చేసింది. లింగాలఘణపురం మండల కేంద్రం, కుందారం, చీటూరు, నవాబుపేట, నెల్లుట్ల డైనింగ్ హాళ్లు మంజూరీ కాగా అందులో నెల్లుట్ల పనులు ఏమీ ప్రారంభించలేదు. నవాబుపేట బేస్‌మెంట్ లెవల్, కుందారం పిల్లర్ల స్థాయి, చీటూరులో 80 శాతం పనులు, లింగాలఘణపురంలో 70 శాతం పనులు పూర్తి అయ్యాయి. వీటికి బిల్లులు రాక పనులు చేసిన గత ఎస్ఎంసీ చైర్మన్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా లింగాలఘణపురం ఉన్నత పాఠశాలకు సుమారు రూ.5 లక్షల విలువైన డైనింగ్ టేబుళ్లు, బెంచీలు వచ్చి సుమారు ఏడాది కావస్తోంది. హాల్ పూర్తి స్థాయిలో నిర్మాణం కాకపోవడంతో నిరుపయోగంగానే ఉన్నాయి. అధికారులు స్పందించి చేసిన పనులకు బిల్లులు వచ్చేలా చేసి వచ్చిన సామాగ్రి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చూడాలని విద్యావంతులు కోరుతున్నారు.

బిల్లులు రాక పనులు పూర్తి కాలే..

చేసిన పనులకు బిల్లులు రాలే..దీంతో డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి కాలేదు. వచ్చిన సామాగ్రి గదిలోనే భద్రపరిచి ఉంది. యాడాది కావస్తున్నా బిల్లుల కోసం పట్టించుకొనే నాధుడే లేడు. అప్పులు చేసి డైనింగ్ హాల్ కట్టాం..అధికారులు దయ తలచాలి.

– సోమ స్వామి, లింగాలఘణపురం, ఎస్ఎంసీ మాజీ చైర్మన్

హాల్ పూర్తి కాకపోవడంతో డైనింగ్ సామగ్రి వేయలేదు

డైనింగ్ హాల్ పూర్తి స్థాయిలో నిర్మాణం కాలేదు. డోర్లు ఏర్పాటు చేసుకొనే విధంగా ఉంటే డైనింగ్ సామగ్రి వేసే వీలు ఉంటుంది. అందుకే వేయలేదు. గదిలోనే భద్రపరిచారు. సమావేశాల్లో బిల్లుల కోసం అధికారుల దృష్టికి తీసుకెళుతున్నాం

– విష్ణుమూర్తి, ఎంఈఓ, లింగాలఘణపురం

బాధిత కుటుంబాలకు సాయం



పాలకుర్తి: సుష్మితకు బాండ్ పత్రాలు అందజేస్తున్న మిత్రులు



పాలకుర్తి: గుడికుంటతండాలో ..

పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను గ్రామంలో గోరంతల భాస్కర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా శుక్రవారం భాస్కర్‌తో చదువుకున్న 1999–2000 పదోతరగి బ్యాచ్ మిత్రులు మృతుడి కూతురు సుష్మిత పేర రూ.70 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలు అందజేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

గుడికుంటతండాలో..

మండలంలోని మంచుప్పుల గుడికుంట తండాకు చెందిన బానోత్ నరేశ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా నరేశ్‌తో స్థానిక మహర్షి విద్యాందిర్‌లో 2013లో కలిసి చదువుకుతున్న మిత్రులు మృతుడి కూతురు సారిక పేర రూ25 వేలు పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి పత్రాలను శుక్రవారం అందజేశారు. స్నేహితులు మహ్మద్ సాజిద్, జోగు అశోక్, గోపగాని రాజు, దాసరి అశోక్ పాల్గొన్నారు.

అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

మండల కేంద్రానికి చెందిన జంపాల మహేందర్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబసభ్యులను అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పరామర్శించి 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడీ హరీశ్, ఒర్రె కుమారస్వామి, జంపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మా ఇల్లు ఆశ్రమానికి..

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని మా ఇల్లు ప్రజాధరణ అనాథ ఆశ్రమానికి పాలకుర్తి మండలం నారాబోయినగూడెం గ్రామానికి చెందిన మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుడు దోపతి రాంరెడ్డి సరోజన జ్ఞాపకార్థం రూ.30 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ మా ఇల్లు ఆశ్రమానికి రాంరెడ్డి ఆర్థికసాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రావు, పిల్లలు పాల్గొన్నారు.



జఫర్‌గఢ్: సాయం అందజేస్తున్న రాంరెడ్డి

గిరిజన తండాలో తొలి ఉద్యోగం సాధించిన ప్రదీప్

- జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైన జేసీబీ డ్రైవర్



కొడకండ్ల: మారుమూల గిరిజన తండలో తొలి ప్రభుత్వ ఉద్యోగం సాధించి యువకులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు మండలంలోని బోడతండాకు చెందిన కున్సోత్ ప్రదీప్. కడగుట్టతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బోడతండాకు చెందిన కున్సోత్ జోగ్యభారతిల రెండో కుమారుడు ప్రదీప్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు, ఆరు నుంచి పదో తరగతి వరకు కొడకండ్లలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్మీడియట్ జనగామలోని ప్రైవేట్ కళాశాలలో ప్రవేశం పొంది ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో జేసీబీ డ్రైవర్‌గా మారి ఇంటర్‌లో ఫెయిల్ అయ్యాడు. ఈ తరుణంలో సూర్యాపేటలో పోస్టల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అతని మేనమామ శుక్లా ప్రోత్సాహంతో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణుడై సూర్యాపేటలోనే ఉండి 2022లో డిగ్రీ పూర్తి చేశాడు. గ్రూప్స్ సాధించాలనే పట్టుదలతో రెండేళ్ల క్రితం గ్రూప్–4 నోటిఫికేషన్ రాగానే హైదరాబాద్ వెళ్లి కోచింగ్ తీసుకుని పట్టుదలతో చదివి పరీక్ష రాశాడు. గ్రూప్–4 ఫలితాల్లో సత్తా చాటి రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైనప్పటికీ భవిష్యత్తులో సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని ప్రదీప్ తెలిపారు. మారుమూల గిరిజన తండా నుంచి ప్రదీప్ తొలి ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై కుటుంబసభ్యులతో పాటు గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌తో పోలీసులు

దేవరుప్పుల: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు అనివార్యమని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని పెద్దమడూరులో అక్రమగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేపు దేవతామూర్తుల పునఃప్రతిష్ఠాపన

దేవరుప్పుల: పెద్దమడూరులో రేపు (ఆదివారం) కంఠమహేశ్వర స్వామి ఆలయంలో బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ ఆర్థిక సాయంతో గౌడ గ్రామ పెద్ద గుంటి, చిన్న గుంటి పెద్దమనుషుల సహకారంతో పురోహితులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పోతురాజుల పునఃప్రతిష్ఠాపన, మహాయజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మహోత్సవానికి గౌడ సామాజిక కుటుంబాలు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఉత్సవం అనంతరం శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.